VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 31 ఆగస్టు 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 43

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

నిండుకుండలా సాగర్ జలాశయం



3లో

## తెలంగాణలో ఇక బిజెపిదే అధికారం

బిఆర్ఎస్ పని అయిపోయినట్లే

తక్కువ కాలంలో అప్రదిష్ట మూటకట్టుకున్న కాంగ్రెస్

బిజెపి సభ్యత్వ నమోదులో బండి సంజయ్ వ్యాఖ్యలు



# 1000 ఎకరాల్లో కొత్త జూపార్క్

- ఆధ్యాత్మిక, ప్రకృతి, హెల్త్ టూరిజంపై విడివిడిగా కార్యాచరణ
- తితిదే తరహాలో యాదగిరిగుట్టకు ఆలయ బోర్డు
- ఫోర్త్ సిటీలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో హెల్త్ హబ్
- హైదరాబాద్ వెలుపల వెయ్యి ఎకరాల్లో మరో జూ పార్క్
- అనంతగిరిలో ప్రకృతి వైద్య కేంద్రం.. రామప్ప ఆకృతిలో కీసర ఆలయం
- 'స్పీడ్' ప్రాజెక్టుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కొత్త విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆధ్యాత్మిక, ప్రకృతి, ఆరోగ్య విభాగాల్లో పర్యాటకం అభివృద్ధికి విడివిడిగా పాలసీలను తయారు చేయాలని స్పష్టం చేశారు. పర్యాటకంలో ముందంజలో ఉన్న ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను తెలుసుకుని.. వాటిలో మెరుగైనవి అనుసరించాలని సూచించారు. స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) సమీక్షలో భాగంగా పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డిలతో కలిసి శుక్రవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.అటు ఉద్యోగాల కల్పనతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడేలా పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

**పీపీపీ విధానంలో కొత్త ప్రాజెక్టులు**

'కేవలం మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తే సరిపోదు. హొటళ్లు, అతిథిగృహాలు నిర్మించి వదిలేస్తే ఉపయోగం ఉండదు. నిరంతరం వీటి నిర్వహణ మెరుగ్గా ఉంటేనే పర్యాటకులు వస్తారు. అందుకే కొత్త ప్రాజెక్టులన్నీ ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టాలి. తెలంగాణలో ఉన్న ప్రాచీన ఆలయాలు, చారిత్రక స్థలాలతో పాటు అటవీ ప్రాంతాల్లో పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలి. అవసరమైన చోట్ల రాత్రి విడిది ఉండేలా కాటేజీలను నిర్మించాలి.

**పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం**

హైదరాబాద్ బయట సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో కొత్త జూ పార్క్‌ను ఏర్పాటు చేయాలి. వివిధ ప్రాంతాల నుంచి జంతువులు, పక్షులను తీసుకువచ్చి కొత్త జూ పార్క్‌లో ఉంచాలి. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో అనంత్ అంబానీ మూడువేల ఎకరాల్లో వనతార పేరిట వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని నెలకొల్పారు. అలా ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలు, సంస్థలను కూడా రాష్ట్రానికి ఆహ్వానించాలి.

వికారాబాద్ జిల్లా అనంతగిరి ప్రాంతంలో అద్భుతమైన ప్రకృతి అటవీ సంపద ఉంది. అక్కడ ఉన్న 200 ఎకరాల ప్రభుత్వ భూములను హెల్త్ టూరిజం అభివృద్ధికి వినియోగించాలి. బెంగుళూరులోని జిందాల్ నేచర్ క్యూర్ ఇన్‌స్టిట్యూట్ తరహాలో ప్రకృతి చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ప్రకృతి వైద్య రంగంలో పేరొందిన ప్రముఖ సంస్థలను పిలవాలి.

సీఎం రేవంత్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న వేములవాడ ఆలయ అర్చకులు. చిత్రంలో ఆది శ్రీనివాస్

**యాదాద్రి రాజగోపురానికి బంగారు తాపడం**

తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో యాదగిరిగుట్టకూ టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలి. తితిదే మాదిరే బోర్డుకు స్వయం ప్రతిపత్తి, విధివిధానాలు ఉండేలా అవసరమైతే చట్ట సవరణ చేయాలి. యాదగిరిగుట్ట ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులను ప్రారంభించాలి. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి పనులు చాలావరకు సగంలో ఆగాయి. ఇంకా చేయాల్సిన పనుల వివరాలతో వారం రోజుల్లో సమగ్ర నివేదికను అందించాలి. కీసరగుట్టపై ఉన్న రామలింగేశ్వర ఆలయాన్ని ములుగు జిల్లాలోని రామప్ప ఆలయానికి ప్రతిరూపంగా నిర్మించాలి.

**ప్రోత్సాహకాలు ఉండేలా కొత్త పాలసీలు**

హైదరాబాద్ ఫోర్త్ సిటీలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న హెల్త్ సిటీలో హెల్త్ టూరిజంను అభివృద్ధి చేయాలి. ఇందులో తమ సెంటర్లు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే సంస్థలకు తగిన ప్రోత్సాహకాలు ఉండేలా కొత్త విధానం తయారు చేయాలి. వివిధ దేశాల నుంచి వచ్చేవారు నేరుగా ఎయిర్‌పోర్ట్ నుంచి ఆసుపత్రికి వెళ్లి వైద్యుల అపాయింట్‌మెంట్, చికిత్స తీసుకునేలా సదుపాయాలన్నీ ఉండాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## పేదల ఇళ్లపైకి బుల్‌డోజర్లు



**పాలమూరులో రోడ్డున పడ్డ 75 కుటుంబాలు వెంటనే ఆపాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు కెటిఆర్ సూచన**


హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పట్ల అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పేదల ఇళ్లపైకి కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లు పంపుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.మీరు చెప్పినట్లుగా, ఒకరి ఇంటిని కూల్చివేసి, వారి కుటుంబాన్ని నిరాశ్రయులుగా మార్చడం అమానవీయం, అన్యాయం అని మల్లికార్జున్ ఖర్గేను ఉద్దేశించి కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. పేదల ఇళ్లపైకి కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్‌లు పంపుతుంది. రాష్ట్రం బుల్డోజర్ రాజ్యంగా మారకుండా సీఎంకు ఖర్గే సలహా ఇవ్వాలి. నోటీసులు ఇవ్వకుండా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 75 ఇండ్లను కూల్చేశారు. ఈ 75 కుటుంబాల్లో దాదాపు 25 కుటుంబాలు వికలాంగులకు చెందినవి. రాష్ట్రంలో చట్టం, న్యాయ వ్యవస్థ పట్ల ధిక్కారం జరుగుతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.తెలంగాణను మరో బుల్‌డోజర్ రాజ్‌గా మారకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి సలహా ఇవ్వాలని కోరారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని 75 పేదల ఇళ్లను తెల్లవారుజామున 3 గంటలకు ఎటువంటి నోటీసులు లేకుండా కూల్చి వేశారు. నిన్న అక్రమంగా కూల్చివేసిన నిరుపేదల్లో 25 కుటుంబాలు శారీరక వికలాంగులు ఉన్నారు. ఆమోదయోగ్యమైన పద్ధతులు పాటించ కుండా, విధి విధానాలు లేకుండా అమలు చేసే చట్టం చట్టమే కాదు. అడ్డగోలుగా నిరుపేదలపైకి బుల్డోజర్ నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి.. తెలంగాణను మరో బుల్డోజర్ రాజ్?గా మార్చకుండా ఆదేశాలు ఇవ్వండి' అని కేటీఆర్ సూచించారు.

## సుప్రీంకోర్టుకు సిఎం రేవంత్ బేషరతు క్షమాపణ

భారత న్యాయవ్యవస్థపై తనకు అపార విశ్వాసం, గౌరవం ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితకు మంజూరైన బెయిల్‌పై సీఎం చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తప్పుపట్టిన నేపథ్యంలో.. ఆయన శుక్రవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు.




# హిమాయత్ సాగర్ వైపు హైడ్రా చూపు



## ప్రైవేట్ సెక్యూరిటీకి అండగా ఉంటాం

హైదరాబాద్: హైదరాబాద్‌ను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో నాలుగు లక్షల మంది ప్రైవేట్ ఏజెన్సీలు ఉన్నాయన్నారు. 1500 ఏజెన్సీలు పనిచెయ్యడం సంతోషమన్నారు. సెక్యూరిటీ ఏజెన్సీలు అనేక మందికి ఉపాధి కల్పించడం సంతోషమన్నారు. సెక్యూరిటీ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఫిజికల్ సెక్యూరిటీలో పనిచేసే వారికి అండగా ఉంటుందన్నారు. కనీస వేతనం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని తెలిపారు. హైదరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెక్యూరిటీ సమ్మిట్ నగర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలను పోలీస్ శాఖ ప్రోత్సహించాల న్నారు. నగరం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నగరానికి ప్రభుత్వం 10 కోట్లు బ్జడెట్‌లో కేటాయించిందని తెలిపారు.

## అక్కడి జలాశయ ఆక్రమణలపై నివేదిక

## పూర్తిస్థాయి సమాచారంతో ఇక రంగంలోకి

హైదరాబాద్: బుల్డోజర్లు ఇక హిమాయత్‌సాగర్ వైపే సాగనున్నాయి. సాగర్ జలాశయ పరిధిలో అక్రమంగా నిర్మించుకున్న ఫామ్ హౌజ్‌లపై హైడ్రా దృష్టి సారించింది. వివరాలు సేకరించింది. వారంలోగా ఇక్కడి జలాశయంలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు రంగం సిద్ధం చేశారు. జలమండలి, రెవెన్యూ అధికారులు ఎఫ్‌టీఎల్ (పూర్తిస్థాయి నీటి మట్టం) పరిధిలో ఉన్న నిర్మాణాలను గుర్తించే పక్రియను చేపట్టారు. మొదటి దశలో కొందరు ప్రముఖుల ఫామ్‌హౌస్‌లు, ఇతర నిర్మాణాలు ఇందులో ఉన్నట్టు తేలింది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలతోపాటు ఇతర పార్టీలు, ప్రముఖుల బంగ్లాలు అందులో ఉన్నాయి. వాటి నుంచి పది భారీ నిర్మాణాలను అధికారులు ఎంపిక చేశారు. అధికార పార్టీ ప్రస్తుత ఎమ్మెల్యే వ్యవసాయ క్షేత్రంతోపాటు ఇతర నేతల ఫామ్‌హౌస్‌లు తెరపైకి వచ్చాయి. ఆయా నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ హద్దు లోపల ఎంత వరకు ఉన్నాయి. బఫర్‌జోన్ లోపల, వెలుపల ఎంత మేర ఉన్నాయనే వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని హైడ్రా కార్యాలయం జలమండలి, రెవెన్యూ అధికారులను ఆదేశించింది. వచ్చే సోమవారానికి నివేదికను పూర్తి చేస్తామని అధికారులు గురువారం హైడ్రాకు నివేదించారు.ఈ నెల 11న గండిపేట జలాశయంలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వ్యాపార వేత్తల ఫామ్‌హౌస్‌లు, హోటళ్లు, క్రీడా ప్రాంగణాలను నేలమట్టం చేశారు. అనంతరం నగరంలోని తమ్మిడికుంటలో నిర్మించిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చింది. ఈర్లకుంట, చింతల్‌చెరువు, తదితర తటాకాల్లోని ఆక్రమణలను తొలగించారు. ఇప్పుడు హిమాయత్‌సాగర్ ఆక్రమణలపైనా దృష్టిపెట్టారు. మొదటి దశలో ఎఫ్‌టీఎల్‌లోని పెద్ద బంగ్లాలను కూల్చుతామని, అనంతరం బఫర్‌జోన్‌లోని కట్టడాలను నేలమట్టం చేస్తామంటున్నారు. జలమండలితోపాటు ఇతర శాఖ అధికారులు క్షేత్రస్థాయి సమాచారంతోపాటు గూగుల్ మ్యాప్‌లతో అక్రమ నిర్మాణాలను గుర్తిస్తున్నారు.



# గుడ్లవల్లేరు ఘటన కలచి వేసింది

విజయవాడ: గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ అమానవీయ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఒక ఆడబిడ్డ తల్లిగా ఈ ఘటన నన్ను తీవ్ర భయాందోళనకు గురిచేసిందని తెలిపారు. చదువు, సంస్కారం నేర్పాల్సిన విద్యాసంస్థలు.. పిల్లలకు ఏం నేర్పుతున్నాయోనన్న ఆలోచనలో పడేసిందని అన్నారు. ఉన్నత చదువుల కోసం ఆడపిల్లలను కాలేజీలకు పంపితే వారి మాన ప్రాణాలకు రక్షణ లేదనడానికి ఈ ఘటనే మరో నిదర్శనమని వైఎస్ షర్మిల పేర్కొన్నారు. కాలేజిల్లో పర్యవేక్షణ కొరవడిందనడానికి ఇదే సజీవ సాక్ష్యమని అన్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యానికి నిలవెత్తు దర్పణమని అన్నారు. కాసుల కక్కుర్తి తప్పా.. భద్రత ప్రమాణాలు గాలికొదిలేశారనే దానికి ఈ ఘటనే ఉదాహరణ అని మండిపడ్డారు. ఈ ఘటనపై సాధారణ విచారణ కాదు. ఫాస్ట్రాక్ విచారణ జరగాలని అభిప్రాయపడ్డారు. తక్షణమే ఉన్నత స్థాయి కమిటీ వేసి సీనియర్ ఐపీఎస్ అధికారులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాత్ రూముల్లో కెమెరాలు పెట్టింది ఎవరో వెంటనే తేల్చాలని షర్మిల అన్నారు. రాజకీయ నాయకుడి కొడుకా.. కూతురా కాదు.. కెమెరాలు పెట్టింది ఎవరైనా.. ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి అఘాయిత్యానికి ఒడిగట్టాలంటే భయపడేలా చర్యలు ఉండాల్సిందేనని అన్నారు. బాత్ రూముల్లో రికార్డ్ అయిన ఏ వీడియో కూడా పబ్లిక్ కాకుండా చూడాలని పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు. వచ్చేవారం లోపు చర్యలు చేపట్టకపోతే కాలేజీని సందర్శించి.. విద్యార్థినులతో మాట్లాడుతానని తెలిపారు. వారు కోరుకున్నట్లు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం చేస్తామని కాంగ్రెస్ పార్టీ తరపున హామీ ఇచ్చారు.

# కాలేజీలో కలకలం

విజయవాడ: తెలుగు రాష్ట్రాలను కుదిపేసే ఘోరం కృష్ణాజిల్లాలో వెలుగులోకి వచ్చింది. అమ్మాయిల హాస్టల్ బాత్రూమ్‌లో కెమెరాలు పెట్టి ఆ వీడియోలను కావాల్సిన వాళ్లకు షేర్ చేస్తున్న దుర్ఘటన ఇప్పుడు సంచలనంగా మారుతోంది. దీన్నో బిజినెస్ మోడల్‌గా చేసుకొని అబ్బాయిలు తమకు నచ్చిన వ్యక్తుల వీడియోలు తెప్పించుకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రతిష్టాత్మక కాలేజీల్లో ఒకటి గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజ్. ఇలాంటి కాలేజీలోనే ఈ దారుణం వెలుగు చూసింది. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని ఇంజినీరింగ్ కళాశాలలో సీక్రెట్ కెమెరాల కలకలం రేగింది. కళాశాలలో గురువారం అర్ధరాత్రి దాటాక విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. బాలికల హాస్టల్ వాష్‌రూమ్‌లో సీక్రెట్ కెమెరాలు పెట్టారని వారు ఆరోపిస్తున్నారు. తెల్లవారు జామున 3.30 గంటల వరకు హైడ్రామా కొనసాగింది. వీడియోలు విక్రయిస్తున్నాడంటూ బీటెక్ విద్యార్థిపై సహచర విద్యార్థులు దాడికి యత్నించారు. విషయం తెలుసుకుని పోలీసులు కళాశాల హాస్టల్‌కు చేరుకున్నారు. పోలీసులను విద్యార్థులను అదుపు చేశారు. అనంతరం ఫైనల్ ఇయర్ విద్యార్థి విజయ్‌ని ప్రశ్నించారు. అతడి ల్యాప్‌ట్యాప్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కెమెరా ఏర్పాటులో విజయ్‌కు మరో విద్యార్థిని సహకరిస్తోందంటూ పలువురు ఆరోపిస్తున్నారు. బాలికల హాస్టళ్లలో హిడెన్ కెమెరా గుర్తించా రంటూ 'ఎక్స్' వేదికగా విద్యార్థుల పోస్టులు పెట్టారు. వారం క్రితమే ఘటన వెలుగు చూసినా యాజమాన్యం పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో అర్ధరాత్రి విద్యార్థినుల ఆందోళనపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నానని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. విద్యార్థినుల హాస్టల్‌లో సీక్రెట్ కెమెరాల ఆరోపణలపై విచారణకు ఆదేశించామన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు కళాశాలల్లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కళాశాలల్లో ర్యాగింగ్, వేధింపులు లేకుండా యాజమాన్యాలు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అయితే ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన అమ్మాయిల హాస్టల్ బాత్రూంలో ఓ కెమెరా ఉండటాన్ని విద్యార్థులు గుర్తించామంటున్నారు. దీనిపై హాస్టల్ వార్డెన్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఇదంతా చేసింది ఓ అమ్మాయే అన్న విషయం తెలిసిన వారంతా ఆశ్చర్యానికి గురవుతున్నారు. అదే కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థినే ఈ దారుణానికి పాల్పడింది. తన బాయ్‌ఫ్రెండ్ కోసం ఇంతటి నీచానికి ఒడిగట్టింది. ఇద్దరూ కలిసి అమ్మాయిల బాత్రూంలో సీక్రెట్ కెమెరాలు పెట్టించి వీడియోలు తీయిస్తున్నట్లు గుర్తించారు. ఇలా తీసిన వీడియోలను కాలేజీలో విద్యార్థులకు విక్రయిస్తున్నట్లుగా కూడా కాలేజీ వర్గాలు, విద్యార్థులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై ఆగ్రహించిన విద్యార్థులు అర్థరాత్రి ఇంజినీరింగ్ కాలేజీలో ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ కాలేజీ, హాస్టల్ యాజమాన్యంపై మండిపడ్డారు. అదే సమయంలో ఇలాంటి పాడు పని చేసిన విద్యార్థిపై సహచర విద్యార్థులు దాడికి దిగినట్లు తెలుస్తోంది. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సద్దుమణిగించే ప్రయత్నం చేశారు. ఇప్పటివరకూ ఈ ఘటనపై అధికారికంగా ఏ సమాచారం బయటకు రాలేదు. ఎంతమంది అమ్మాయిల వీడియోలను తీశారు దీనికి కారణం ప్రేమ వ్యవహారామా..లేదా ఘటనకు కారణమైన అమ్మాయిని బెదిరించి ఇదంతా చేయించారా అన్న కోణాల్లోనూ సమాచారాన్ని అధికారులు బయటకు చెప్పటం లేదు. విద్యార్థులు ఈ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ దుర్ఘటనకు సంబంధించిన వీడియోలను వైసీపీ నేతలు షేర్ చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. లోకేష్, పవన్ కల్యాణ్, చంద్రబాబుకు ట్యాగ్ చేసి విషయంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఎందుకు నోరు విప్పడం లేదని అంటున్నారు. ఇప్పుడు సోషల్ మీడియాలో ఇదో సంచలనంగా మారుతోంది. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఘటనలను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఖండించారు. అమెరికా పర్యటనలో ఉన్న రాము గురువారం రాత్రి కళాశాలలో జరిగి పరిణామాలపై స్పందించారు. కళాశాలలో విద్యార్థులు చేస్తున్న ఆరోపణలపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. ఈ ఘటన వెనుక ఎంతటి వారు ఉన్న ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. దయచేసి విద్యార్థులు అపోహలను నమ్మవద్దని, ఆధారాలు లేని విషయాలను ప్రచారం చేయవద్దంటూ ఎమ్మెల్యే రాము సూచించారు.


ఎటువంటి వివక్షత లేకుండా గుడ్లవల్లేరు ఘటనపై దర్యాప్తు జరుగుతుందని... విద్యార్థినీ, విద్యార్థులెవరు ఒందోళన చెందవద్దనీ విద్యార్థి లోకానికి తాను అన్ని వేళల అండగా ఉంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విద్యార్థులకు భరోసా ఇచ్చారు.

# శివాజీ భారీ విగ్రహం కూలిన ఘటన



**ముంబయి:** మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కూలిన ఘటనపై విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఘటనపై తాజాగా ప్రధాని మోదీ క్షమాపణలు తెలియజేశారు. 'నేను ఇక్కడ దిగిన వెంటనే.. విగ్రహం కూలడంపై శివాజీకి క్షమాపణలు చెప్పాను. ఈ ఘటన వల్ల బాధకు గురైన వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను' అని వెల్లడించారు. 'ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను తమ దైవంగా భావించేవారు ఈ ఘటనతో తీవ్ర వేదనకు గురయ్యారు. నా తలవంచి వారికి క్షమాపణలు చెబుతున్నా. మనకు ఈ దైవం కంటే గొప్పది ఏమీ లేదు' అని మోదీ మాట్లాడారు. శుక్రవారం మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో పర్యటించిన సందర్భంగా ఆయన ఈ విధంగా స్పందించారు. ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కొద్దిరోజుల క్రితం కుప్పకూలిపోయింది. 35 అడుగుల ఎత్తున్న ఈ విగ్రహాన్ని గతేడాది డిసెంబరు 4న నౌకాదళ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మోదీ ఆవిష్కరించారు. రాష్ట్రంలో కురిసిన వర్షాల కారణంగానే విగ్రహం కూలినట్లు భావిస్తున్నామని, అసలు కారణాన్ని నిపుణులు త్వరలోనే వెల్లడిస్తారని అధికారులు తెలిపారు. కాగా, తొమ్మిది నెలలు కూడా పూర్తికాకుండానే విగ్రహం కూలిపోవడం పట్ల ప్రతిపక్షాలు మండిపడ్డాయి. రాష్ట్రప్రభుత్వానికి ప్రచారం మీద ఉన్న దృష్టి, నాణ్యత మీద లేదని దుయ్యబట్టాయి.

## మహిళల భద్రతకుమరింత కఠినంగా చట్టాలు



**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈనేపథ్యంలో దేశంలో మహిళల భద్రత కోసం ఇంకా ఎంతో చేయాల్సి ఉందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ దిశగా ప్రభుత్వం తీవ్ర యోచన చేస్తోందని అన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. 'అత్యాచారం వంటి నేరాలకు మరణశిక్ష విధించేలా చట్టాలను సవరించాం. ఆ చట్టాలను కఠినంగా అమలుచేయాలి. దేశంలో మహిళలపై జరుగుతోన్న అఘాయిత్యాలు, నేరాలు చూస్తుంటే.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందనిపిస్తోంది. మహిళలపై జరుగుతోన్న నేరాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన వైఖరిని అవలంబిస్తోంది. ఆ దిశగా కొన్ని రాష్ట్రాలు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటన అమానవీయమైనది' అని మంత్రి పోస్టు పెట్టారు. అలాగే తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన రాజ్‌నాథ్.. మహిళల భద్రత అంశాన్ని ప్రస్తావించారు. అభివృద్ధిలో స్త్రీల భాగస్వామ్యం తమ ప్రభుత్వ హయాంలో భారీగా పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం గురించి ప్రస్తావించారు. తమ ప్రభుత్వం తీసుకున్న చొరవ వల్ల హరియాణా వంటి రాష్ట్రాల్లో లింగనిష్పత్తిలో మెరుగుదల కనిపించిదని చెప్పారు. 'స్వాతంత్ర్యం÷-ర తర్వాత.. ఈ దేశ అభివృద్ధిలో మహిళలకు తగిన ప్రాధాన్యం లభించలేదు. కానీ ఇప్పుడు ఈ పరిస్థితిలో అనూహ్య మార్పు వస్తోంది. దేశ భద్రతా బలగాల్లో మహిళల పాత్ర పెరుగుతుండటమే అందుకు నిదర్శనం' అని తెలిపారు. కొన్ని రోజుల క్రితం బెంగాల్‌లోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో రాత్రి సమయంలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై అఘాయిత్యం జరిగింది. ఆ మరుసటి రోజు ఉదయం ఆసుపత్రి సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఈ కేసులో పోలీసు వాలంటీర్ అయిన నిందితుడు సంజయ్‌రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈ కేసును కలకత్తా హైకోర్టు.. సీబీఐకి బదిలీ చేసింది. దీనిపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని విపక్షాలు, పలు సంఘాలు డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తంచేస్తున్నాయి. ఈనేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం అత్యాచారాల నిరోధకానికి కొత్త బిల్లు తీసుకురాబోతోంది. కఠిన నిబంధనలతో రూపొందిస్తున్న ఈ బిల్లు ప్రకారం దోషులుగా తేలిన వ్యక్తులకు మరణ దండన విధించే అవకాశం ఉంటుందని శాసనసభ వ్యవహారాల మంత్రి సోవన్‌దేబ్ ఛటోపాధ్యాయ్ వెల్లడించారు. బిల్లును సభలో సమగ్రంగా చర్చించి ఆమోదించడం కోసం సెప్టెంబరు 2 నుంచి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు స్పీకర్ బిమన్ బెనర్జీ తెలిపారు.

## సుప్రీంకోర్టుకు సిఎం రేవంత్ బేషరతు క్షమాపణ



**హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సుప్రీం కోర్టుకు క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు సీఎం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ విషయంలో తన కామెంట్లు న్యాయవ్యవస్థను ప్రశ్నించినట్టు ఆపాదించారని ఈ ట్వీట్‌లో వెల్లడించారు. వార్తాపత్రికల్లో వచ్చిన వార్తలపై బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. భారత న్యాయవ్యవస్థపై తనకు అత్యంత విశ్వాసం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన రేవంత్.. శుక్రవారం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. 'నా వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను ప్రశ్నిస్తున్నట్లుగా కొందరు ఆపాదించారు. పత్రికల్లో వచ్చిన వార్తలపై బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నా. న్యాయవ్యవస్థ, దాని స్వతంత్రత పట్ల నాకు అపార గౌరవం, విశ్వాసం ఉన్నాయి.
రాజ్యాంగం, దాని విలువలను విశ్వసించే నేను.. ఎన్నటికీ న్యాయవ్యవస్థను అత్యున్నతమైనదిగా భావిస్తూనే ఉంటా' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ముఖ్యమంత్రి ప్రకటనలను ఈ రోజు పత్రికల్లో చదివాం. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి చేయాల్సిన వ్యాఖ్యలేనా అవి? మేం రాజకీయపార్టీలను సంప్రదించో.. లేక రాజకీయాంశాల ఆధారంగానో ఉత్తర్వులిస్తామా?' అని ధర్మాసనం తీవ్రంగా ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలపై తాజాగా స్పష్టతనిచ్చారు.

# కాంగ్రెస్‌లో బిఆర్ఎస్ విలీనం ఖాయం



**హైదరాబాద్:** బీఆర్ఎస్, కాంగ్రెస్ విలీనం ఖాయమని, త్వరలోనే అమెరికాలో అప్పగింతలు కాబోతున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. అందుకే 38 మంది ఎమ్మెల్యేలున్నా బీఆర్ఎస్ రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయకుండ పరోక్షంగా కాంగ్రెస్ కు సపోర్ట్ చేసిందని చెప్పారు. బీజేపీ కవితకు బెయిల్ ఇప్పించిందంటూ కాంగ్రెస్ ఆరోపిస్తోందని, సుప్రీంకోర్టుకు, బీజేపీకి ఏం సంబంధమని బండి ప్రశ్నించారు. సుప్రీంకోర్టును ధిక్కరించేలా కాంగ్రెస్ వ్యాఖ్యలున్నాయి. అందుకే కోర్టు హెచ్చరించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతో తమ పార్టీ కార్యకర్తలు కొట్లాడితేనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, గడీల బద్దలు కొట్టిన చరిత్ర బీజేపీదేనని బండి సంజయ్ అన్నారు. బీజేపీ కుటుంబ, అవినీతి పాలనకు వ్యతిరేకమని ఎట్టి పరిస్థితిలోనూ బీఆర్ఎస్ తో కలువబోదని చెప్పారు.

## నిండుకుండలా సాగర్ జలాశయం

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద కొనసాగుతున్నది. దీంతో సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువయ్యింది. ఎగువ నుంచి 3,12,093 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. దీంతో అధికారులు వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు మొత్తం 26 క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటినిల్వ 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 309 టీఎంసీలు ఉన్నాయి. గరిష్ట నీటిమట్టం 590 అడుగులకుగాను 589.20 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నది. ప్రాజెక్టులోని 26 గేట్లలో ఎనిమిది గేట్లను పది అడుగుల మేర, మరో 18 గేట్లను 5 అడుగుల మేర ఎత్తివేశారు. దీంతో స్పిల్‌వే ద్వారా 2,63,168 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తుండగా, ఎడమ కాలవుకు 8280 క్యూసెక్కులు, కుడి కాలవుకు 9500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి ద్వారా 28,785 క్యూసెక్కుల నీరు వెళ్తున్నది.

## టిటిడి తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు

**హైదరాబాద్:** రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి నూతన విధానం రూపొందించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. 'స్పీడ్' ప్రాజెక్టులపై సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఎకో, టెంపుల్ పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హెల్త్ టూరిజంను అభివృద్ధి చేయాలని చెప్పారు. హైదరాబాద్ బయట మరో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. యాదగిరిగుట్ట అభివృద్ధిపై అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. తితిదే బోర్డు మాదిరే యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధిలో పెండింగ్ పనుల వివరాలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన చర్యలపై వివరాలు ఇవ్వాలని సూచించారు. ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులు వేగవంతం చేయాలన్నారు. ఆలయ అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆపవద్దని స్పష్టం చేశారు. వైటీడీఏ, యాదగిరిగుట్టకు సంబంధించి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతి కుమారి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రమేష్‌రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## 15 ఏళ్లుగా నత్తనడకన దేవాదుల ప్రాజెక్ట్

**ములుగు:** 15 ఏళ్లుగా దేవదుల ప్రాజెక్ట్ నత్తనడకగా సాగుతోందని, 2026 మార్చి నాటికి పూర్తి చేసి, సోనియా గాంధీతో ప్రారంభిస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. 300 రోజుల పాటు నీటి ఎత్తిపోసేలా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తాం అన్నారు.. పెండింగ్ బిల్ అన్ని క్లియర్ చేస్తాం అన్న మంత్రులు.. పొరుగు రాష్ట్రాల తో సత్ సంబంధాలతో ఉంది త్వరితగతిన ప్రాజెక్టు పనుల చేపడతాం అన్నారు. గత ప్రభుత్వం కేవలం పనులు చేశారు జేబులు నింపుకున్నారు కానీ ప్రజలకు లాభం జరగలేదు. లక్ష 80 వేల కోట్లు ఇరిగేషన్ శాఖ పైనా ఖర్చు చేసిన గత బిఆర్ఎస్ పాలకులు పనుల పేరుతో జేబులు నింపుకున్నరని అన్నారు. ప్రాజెక్టుల పని పేరుతో గత ప్రభుత్వా నేతలు దోచుకున్నారని విమర్శించారు. ములుగు జిల్లాలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద దేవాదుల పంపింగ్ స్టేషన్ ను సందర్శించి, ప్రాజెక్టు ఇంటెక్ వెల్, పంప్ హౌస్ ను పరిశీలించారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయడంపై అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. 2025 డిసెంబర్ నాటికి దేవాదుల ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. 2026 మార్చ్ లో సోనియాగాంధీ చేతుల మీదుగా ప్రాజెక్టును ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 38 టీఎంసీల నీరు ఎత్తిపోయడానికి ప్రాజెక్ట్ డిజైన్ చేశారని ప్రస్తుతం సమ్మక్క బ్యారేజ్ నిర్మాణం వల్ల 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందన్నారు మంత్రి ఉత్తమ్. సంవత్సరంలో 300 రోజులపాటు 60 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి 5.57 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అన్నారు.

# అనుమతులు లేకుండా జాన్వాడ ఫామ్‌హౌజ్ నిర్మాణం

### నిర్ధారణకు వచ్చిన పంచాయితీ అధికారులు

### త్వరలోనే నోటీసులు ఇచ్చే అవకాశం ?

**హైదరాబాద్:** జన్వాడ ఫాంహౌస్‌కు రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల నుంచి ఎలాంటి అనుమతుల్లేవని అధికారులు ప్రాథమిక సమాచారం సేకరించినట్లు తెలిసింది. హైదరాబాద్ సమీపంలోని శంకర్‌పల్లి మండలం జన్వాడ రెవెన్యూ పరిధిలో ఉన్న ఈ ఫాంహౌస్ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అధీనంలో ఉండడం, బుల్కాపూర్ నాలా బఫర్‌జోన్ పరిధిలో ఉందన్న ప్రచారంతో చేవెళ్ల రెవెన్యూ డివిజన్ అధికారులు అంతర్గతంగా పలు అంశాలను సేకరించారని సమాచారం. ఈ ఫాంహౌస్‌ను మిర్జాగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఎనిమిదేళ్ల క్రితం నిర్మించారు. అప్పట్లో గ్రామపంచాయతీ కార్యదర్శి అక్రమ కట్టడంగా గుర్తించారని తెలుస్తోంది. ఫాంహౌస్ యజమాని ఎన్.ఎస్.ఎల్.ఆర్.ప్రసాదరాజు చిరునామాకు నోటీసులు సైతం పంపించారని సమాచారం. ఆయన స్పందించకపోవడంతో పంచాయతీ ఆదాయం నిమిత్తం కొద్దిరోజుల తర్వాత ఫాంహౌస్‌కు ఇంటి నంబర్ 4-5 కేటాయించి అసెస్‌మెంట్ చేశారు. ఫాంహౌస్ విస్తీర్ణం 362 గజాలని, 3,200 చదరపు అడుగుల్లో ఉందని గ్రామపంచాయతీ అధికారులు లెక్కలు వేసి.. ఏటా రూ.11 వేలు పన్ను చెల్లించాలని అసెస్‌మెంట్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జీవో నంబరు 111 పరిధిలో ఫాంహౌస్ ఉందని తెలిసినా.. దాన్ని వేరే యంత్రాంగం పర్యవేక్షిస్తుందన్న భావనతో అప్పట్లో వారు పన్ను మాత్రమే విధించారు. ఆ మేరకు నిర్వాహకులు ఏటా ఇంటి పన్ను చెల్లిస్తున్నారు. జన్వాడ ఫాంహౌస్ పరిసర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న బుల్కాపూర్ నాలా పరీవాహక ప్రాంతంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు గురువారం సర్వే పూర్తి చేశారు. ఉపగ్రహ చిత్రాలు, గ్రామపటాలను సరిపోల్చారు. నాలా బఫర్‌జోన్‌లో ఫాంహౌస్ ఉందా? లేదా? అని నిర్ధారించుకున్నాక రంగారెడ్డి కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నారు. ఇప్పటికే అధికారులు వరుసగా పలు దఫాలుగా ఇక్కడ పరిశీలన చేశారు. అయితే ఈ ఫామ్ హౌజ్ తనది కాదని, తన మిత్రుడిదని మాజీమంత్రి కెటిఆర్ ప్రకటించడం కొసమెరుపు.

# గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గవచ్చు


## జాతీయ మీడియాలో కథలనాలు

**న్యూఢిల్లీ:**వచ్చే నెల 1న ప్రభుత్వం సామాన్యులకు శుభవార్త చెప్పబోతోంది. గ్యాస్ సిలిండర్ ధరలతోపాటు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. సెప్టెంబర్ 1 నుంచి ఇంటి అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర రూ.50.. వాణిజ్య సిలిండర్ల ధర రూ.60 నుంచి రూ.70 వరకు తగ్గుతుందని నేషనల్ మీడియా కథనాలు స్పష్టం చేస్తున్నాయి. ఆగస్టులో బిజినెస్-గ్రేడ్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధర రూ.8.50 పెరిగింది, జూలైలో రూ.30 తగ్గింది. గతేడాది రాఖీ, ఈ ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.300 తగ్గించింది. ఇప్పుడు దాని ధర మరో రూ.50 తగ్గితే.. రూ.760కే అందుబాటులోకి వస్తుంది. పీఎం ఉజ్వల యోజ కింద రాయితీ పొందేవారు రూ.460కే సిలిండర్‌ని ఇంటికి తీసుకెళ్లవచ్చు.గ్యాస్ సిలిండర్ రేట్లతోపాటు పెట్రోల్, డీజిల్ ధరలు కూడా తగ్గనున్నట్లు సమాచారం. పెట్రోల్ లీటర్‌పై రూ.6, డీజిల్ లీటర్‌పై రూ.5 వరకు తగ్గనున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో పెట్రోల్ ధర లీటర్ రూ.100 దాటగా.. డీజిల్ ధర రూ.90 దాటింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు రేట్లు తక్కువగా ఉండటంవల్లే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# లారీ ప్రమాదంలో బాలిక మృతి

## సిసి పుటేజ్ ఆధారంగా డ్రైవర్ అరెస్ట్

హైదరాబాద్:హబ్సిగూడలో గురువారం సాయంత్రం లారీ ప్రమాదానికి గురి అయిన బాలిక కామేశ్వరి సీసీ ఫుటేజ్ వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా లారీ డ్రైవర్ ను పోలీసులు అదుపులో తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే ..హబ్సిగూడలో లారీ ఢీకొని ఆరో తరగతి విద్యార్థి మృతి చెందింది. తార్నాక డివిజన్ హనుమాన్ నగర్ స్ట్రీట్ నెం.12లో నివాసముంటున్న సంతోషి, నీల్‌కుమార్ దంపతుల పెద్ద కుమార్తె కామేశ్వరి(10) ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. కుమారుడు వేదాంష్ కూడా అదే పాఠశాలలో చదువుతున్నాడు. ఎప్పటిలాగే సంతోషి మధ్యాహ్నం పాఠశాల నుంచి పిల్లలను తీసుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరింది. హబ్సిగూడలో వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వెళుతున్న లారీ ఢీకొట్టడంతో కిందపడిపోయారు. కామేశ్వరిపై నుంచి లారీ దూసుకెళ్లడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే కామేశ్వరి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లారీ డ్రైవర్ మియారం జుట్ (40)ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలిక కామేశ్వరి సీసీ ఫుటేజీ వెలుగులోకి రావడంతో.. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద స్థలంలో కూతురిని పట్టుకుని తల్లి కన్నీరుమున్నీరుగా విలపించడం స్థానికులకు కంటతడి పెట్టించింది.




# సింగరేణి కార్మికులకు శుభవార్త

## 2,364 మంది బదిలీ వర్కర్ల పోస్టుల క్రమబద్ధీకరణ



**హైదరాబాద్** సింగరేణి కార్మికులకు యాజమాన్యం శుభవార్త చెప్పింది. సింగరేణి కాలరీస్ సంస్థలో పనిచేస్తున్న 2,364 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్టు సంస్థ ఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. సంస్థలో చేరినప్పటి నుంచి ఏడాదిలో భూగర్భ గనుల్లో 190 రోజులు, ఉపరితల గనులు, విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహించిన వారిని రెగ్యులరైజ్ చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబరు ఒకటి నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించబోతున్నట్లు స్పష్టం చేశారు. ఎలాంటి నిరీక్షణ లేకుండా ఏడాదిలో నిర్ణీత మస్టర్లు పూర్తి చేసిన వారిని జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తుండటం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. సింగరేణిలో కారుణ్య

, డిపెండెంట్ ఉద్యోగ నియామక పక్రియలో భాగంగా సంస్థలో చేరిన వారిని తొలుత బదిలీ వర్కర్లుగా సంస్థ నియమిస్తోంది. ఏడాది కాలం పనిచేసిన తర్వాత కనీస మస్టర్లు పూర్తి చేస్తే జనరల్ మజ్దూర్లు (శాశ్వత ఉద్యోగులు)గా గుర్తిస్తోంది. ఉన్నత విద్యార్హతలు కలిగిన వీరంతా కంపెనీలో ఇంటర్నల్ ఉద్యోగాల ద్వారా పదోన్నతులు పొందడానికి అర్హత లభిస్తుంది. అలాగే క్వార్టర్ల కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుంది. క్రమశిక్షణతో పనిచేయాలని సీఎండీ ఎన్.బలరామ్ కోరారు.

# తెలంగాణలో ఇక బిజెపిదే అధికారం



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో 2028లో జరిగే ఎన్నికల్లో రానున్నది బిజెపి ప్రభుత్వమేనని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ జోస్యం పలికారు. అతి తక్కువ సమయంలో ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. బీఆర్ఎస్ మళ్లీ వచ్చే పరిస్థితి లేదని, అంతారాసిపెట్టుకోండి 2028లో రానున్నది రామరాజ్యమేనని అన్నారు. తెలంగాణలో ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యి మీద పడినట్లు అయిందని చెబుతూ కెసిఆర్ వద్ద శిక్షణ పొందిన కార్యకర్తలే కాంగ్రెస్ నాయకులని ఘాటుగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉన్న ఓ కన్వెన్షన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదుపై మోర్చాలు, సెల్స్ సంయుక్త కార్యశాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేసి పొరపాటు చేశామని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్‌లో విలీనం ఖాయమని, త్వరలోనే అమెరికాలో అప్పగింతలు కాబోతున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. అందుకే 38 మంది ఎమ్మెల్యేలున్నా బీఆర్ఎస్ రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయకుండా పరోక్షంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిందని పేర్కొన్నారు. బిజెపి కవితకు బెయిల్ ఇప్పించిందంటూ కాంగ్రెస్ ఆరోపిస్తోందని, సుప్రీంకోర్టుకు, తమ పార్టీకి ఏం సంబంధమని బండి ప్రశ్నించారు. సుప్రీంకోర్టును ధిక్కరించేలా కాంగ్రెస్ వ్యాఖ్యలు ఉన్నందునే కోర్టు హెచ్చరించిందని గుర్తు చేశారు. బిజెపి కుటుంబ, అవినీతి పాలనకు తాము వ్యతిరేకమని ఎట్టి పరిస్థితిలోనూ బీఆర్ఎస్‌తో కలువబోదని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ గడీలను బద్దలు కొట్టిన చరిత్ర తమ పార్టీదేనని బండి స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం తనపై 109 కేసులు పెట్టిందని,రెండుసార్లు జైలుకు

పంపిందని గుర్తు చేసిన ఆయన కేసీఆర్ కుటుంబాన్ని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎన్నో అవమానాలను తట్టుకొని, దేశం కోసం, ధర్మం కోసం నిలిచిన పార్టీ బీజేపీ అని బండి సంజయ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాట ముచ్చట అయిపోయిందని, త్వరలో కలసిపోతాయనిబండి సంజయ్ ఆయా పార్టీలకు బదులిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎన్ని రోజులు ఇలా తప్పించుకుంటావని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బిజెపి మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ఘాటుగా విమర్శించారు. హైడ్రా పేరుతో హడావుడి చేస్తూ హైడ్రామా చేస్తోందని ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. హైడ్రా పేరుతో పేదల జోలికి వస్తానంటే అది మీ తరం కాదని, పేదల జోలికి వస్తే కబడ్దార్ అని హెచ్చరించారు. నిజంగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే పనే చేయాలంటే ముందుగా బాధితులకు ప్రత్యామ్నాయంగా ఇళ్లు నిర్మించి ఇచ్చి అప్పుడు కూల్చి వేయాలన్నారు. అంతే తప్పు ఆరు గ్యారెంటీల హామీలపై చర్చ జరగకుండా ఎన్ని రోజులు తప్పించుకుంటారో చూస్తామని హెచ్చరించారు. ఇవాళ మీరు తప్పించుకోవచ్చు కానీ ప్రజాక్షేత్రంలో మీకు శిక్ష తప్పదన్నారు.మీరు రెడ్ బుక్ రాస్తున్నానని గతంలో చెప్పావు, బీజేపీ తరపున మేము కూడా నీ చిట్టా అంతా రాసుకుంటున్నామని సందర్భం వచ్చినప్పుడు ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని పేర్కొన్నారు. రాజ్యంగబద్ధమైన పదవిలో ఉన్న సీఎం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డిపై సుప్రీంకోర్టు కామెంట్స్ చూస్తే ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఎంత బాధ్యతా రహిత్యంగా, సంస్కారహీనంగా మాట్లాడుతున్నారో అర్థమవుతున్నదని అన్నారు. ఈ ఏడాది, వచ్చే ఏడాది అన్ని స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగబోతున్నాయని పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అనుభవం కలిగిన పెద్ద లీడర్లు సైతం లోకల్ బాడీ ఎన్నికల పోటీలో ఉండబోతున్నారని రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ విషయాన్ని జేపీ నడ్డా, అమిత్ షా సైతం ఇదివరకే చెప్పారని అందువల్ల పార్టీ సభ్యత్వ నమోదు ప్రాముఖ్యతను అన్ని మోర్చాలు గుర్తించాలని సూచించారు.

# త్వరలో 'భారత్ డోజో యాత్ర'

## మార్షల్ ఆర్ట్స్‌ను యూత్‌కు పరిచయం చేసే లక్ష్యం

## వీడియో షేర్ చేసిన రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ:** త్వరలో తాను 'భారత్ డోజో యాత్ర' చేపడతానని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వెల్లడించారు. మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్ సెంటర్లను డోజోగా పిలుస్తారని తెలిపారు. మెడిటేషన్, జివూ-జిట్సూ(బ్రెజిల్ మార్షల్ ఆర్ట్స్), ఐకిడో (జపాన్ మార్షల్ ఆర్ట్స్) వంటి ఆర్ట్స్ లను ఉపయోగించి అహింసతో ఘర్షణలను పరిష్కరించే పద్ధతులు యువతకు పరిచయం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. గురువారం నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా రాహుల్ గాంధీ.. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్ర చేసే టైంలో తమ శిబిరాల వద్ద జరిగిన మార్షల్ ఆర్ట్స్ సెషన్ వీడియోను ఎక్స్ లో షేర్ చేశారు. ఆ వీడియోలో స్టూడెంట్లకు రాహుల్ మార్షల్ ఆర్ట్స్ సెషన్స్ నిర్వహించారు. తనకు ఐకిడోలో బ్లాక్ బెల్ట్, జివూ -జిట్సూలో బ్లూ బెల్ట్ ఉందని తెలిపారు. తన వీడియో ద్వారా కొందరిలోనైనా ఈ ఆర్ట్స్ నేర్చుకోవాలనే ఇంట్రస్ట్ రావాలని ఆశించారు. 'మేం వేల కిలోమీటర్లు జోడో యాత్ర చేశాం. ఆ టైంలో మా శిబిరాల వద్ద ప్రతిరోజు జివు-జిట్సూ ప్రాక్టీస్ చేసేవాళ్లం. ఫిట్ గా ఉండేందుకు మేం ప్రారంభించిన యాక్టివిటీ అందరికీ చేరువైంది. మేం బస చేసిన ప్రాంతాల్లోని తోటి యాత్రికులు, యువ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులను ఒకచోటకు చేర్చింది. మెడిటేషన్, జివూ-జిట్సూ, ఐకిడోల వంటి జెంటిల్ ఆర్ట్స్ ను యువతకు పరిచయం చేయడమే మా లక్ష్యం అని పేర్కొన్నారు. దీనిద్వారా ఘర్షణ వాతావరణాన్ని సౌమ్యంగా మార్చే విలువల్ని వారిలో పెంపొందించాలని, దయ, సురక్షితమైన సమాజం కోసం కావాల్సిన సాధనాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకే త్వరలో భారత్ డోజో యాత్ర చేపట్టాలని నిర్ణయించాం' అని రాహుల్ ట్వీట్ చేశారు. రాహుల్ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' మొత్తం 110 జిల్లాలు, 100 లోక్ సభ స్థానాలు, 337 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 60 రోజులకుపైగా 6,713 కిలోమీటర్ల మేర కొనసాగింది. అంతకుముందు రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడోయాత్ర' ను నిర్వహించారు.



# ట్రంప్‌ను ఓడించడానికి అంతా సిద్ధం

## తొలి ఇంటర్వ్యూలో కమలాహ్యారిస్

**వాషింగ్టన్** అమెరికా ప్రజలు డొనాల్డ్ ట్రంప్‌ను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ అన్నారు. డెమోక్రాట్ల తరఫున అధ్యక్ష అభ్యర్థిగా ఖరారైన తర్వాత ఆమె తొలిసారిగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. అక్రమ వలసలపై తాను కఠినంగా వ్యవహరిస్తానని చెప్పారు. చమురు, సహజవాయువు నిక్షేపాలను వెలికితీసేందుకు మద్దతిస్తానని చెప్పిన హారిస్, తన ఉదారవాద లక్షణాలను మాత్రం విడిచిపెట్టలేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె ట్రంప్ పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన అమెరికన్లను, అమెరికన్ల శక్తి సామర్థ్యాలను తక్కువ చేసే అజెండాతో పనిచేస్తున్నారని ఆరోపణలు చేశారు. అలాంటి వ్యక్తిని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని హారిస్ పిలుపునిచ్చారు. తాను అధికారంలోకి వస్తే కేబినెట్‌లోకి రిపబ్లికన్‌ను తీసుకుంటానని కమలా హారిస్ ఆసక్తికర ప్రకటన చేశారు. అక్రమ వలసలపై ఉదారంగా వ్యవహరించానని తనపై వస్తున్న ఆరోపణలను ఆమె కొట్టి పారేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ చమురు వెలికితీతను నిషేధించబోనని ఆమె స్పష్టం చేశారు. తద్వారా పెన్సిల్వేనియో వివాదానికి ఆమె తెరదించారు. అధ్యక్ష ఎన్నికల్లో గెలుపోటములను ప్రభావితం చేసే కీలక రాష్ట్రాల్లోఇది కూడా ఒకటి. గాజా కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇజ్రాయెల్ విషయంలో అధ్యక్షుడు బైడెన్ విధానాలను కొనసాగిస్తానని ఆమె పేర్కొన్నారు. ఇదిలావుంటే డొనాల్డ్ ట్రంప్‌కు సొంత పార్టీ నాయకులు భారీ షాకిచ్చారు. సుమారు 200 మంది రిపబ్లికన్లు, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మద్దతు ప్రకటిస్తూ లేఖ రాయడం ట్రంప్‌ను షాక్‌కు గురిచేసింది. అయితే వీరంతా జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో వీరంతా ఆయనకు అనుకూలంగా పనిచేసినవారే కావడం గమనార్హం. ఫ్యాక్స్ న్యూస్ కథనం ప్రకారం వీరంతా 2020లో కూడా ట్రంప్ పోటీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించినట్టు తెలుస్తోంది. వీరంతా ట్రంప్‌కు వ్యతిరేకంగా తీర్మాణం చేశారు. ట్రంప్‌ని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే ప్రజాస్వామ్యాన్ని కోలుకోలేని దెబ్బతీస్తారని ఆ లేఖలో హెచ్చరించారు. కమలా హారిస్‌తో మాకు సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నప్పటికీ, ఆ స్థాయిలో దేశానికి సేవ చేసే నాయకులు ఇంకెవరూ ప్రస్తుతం లేరని వారు లేఖలో పేర్కొన్నారు. ట్రంప్‌ను ఓడించడానికి జార్జ్ హెచ్ డబ్ల్యూ బుష్ మద్దతుదారులమతా ఒక్కటవుతామని హెచ్చరించారు.

# ప్రతిపక్షంపై కక్షతో అభివృద్ధికి అడ్డు



## 9 నెలలుగా అభివృద్ధి నిరోధక ఎజెండా

## స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ నిలిపివేత

## ట్విట్టర్ వేదికగా హరీస్ రావు విమర్శలు

**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అభివృద్ధి కాంక్షను పక్కనబెట్టి, రాజకీయ కక్షతో ముందుకు వెళ్లడం గర్హనీయమని విమర్శించారు. రేవంత్ రెడ్డి దివాళాకోరు రాజకీయాలకు ఇది పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి నిరోధక అజెండాతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నది. ఈ ప్రభుత్వానికి కొత్త పనులను చేపట్టే శక్తిసామర్థ్యాలు లేవని ఇప్పటికే తేలిపోగా, మంజూరైన పనులను పూర్తి చేసే కనీస నైతిక బాధ్యత కూడా లేదని పనుల రద్దుతో స్పష్టమైంది. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద 33 జిల్లాల్లో మంజూరైన సుమారు రూ.10 వేల కోట్ల విలువ చేసే 34,511 పనులను రద్దు చేయడమే దీనికి నిదర్శనమన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఈ వివరాలను బయటపెట్టిందంటూ ఎక్స్ వేదికగా వెల్లడించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా మంజూరైన అనేక పనులను నిలిపివేయడంతో పాటు, ఇప్పటికే ప్రారంభమైన అనేక పనులను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగించొద్దని మధ్యంతరంగా నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. దాదాపు పూర్తి కావొస్తున్న ప్రాజెక్టులకు సైతం బిల్లుల చెల్లింపులు నిలిపివేసింది. దీంతో రాష్ట్రంలోని దాదాపు ప్రతి గ్రామంలో పంచాయతీరాజ్, మున్సిపల్, రోడ్లు-భవనాలు, నీటిపారుదల తదితర శాఖలపరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన పక్రియకు ఆటంకం కలిగింది. దీంతో ఎంతో మంది ఉపాధి కూడా కోల్పోతున్నారు. కాంగ్రెస్ పాలన ప్రజలకు శాపంగా మారింది. అభివృద్ధి నిరోధకులుగా ముఖ్యమంత్రి వ్యవరిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గాలకు కేటాయించిన ఎస్డీఎఫ్ నిధులను ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసింది. అయితే ఈ నిధుల నుండే మార్చి నెలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకు 10 కోట్ల చొప్పున మంజూరు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రమే నిధులు ఇచ్చి తన కురచ బుద్ధిని, పక్షపాత ధోరణిని చూపింది. కాంగ్రెస్ పార్టీ గెలవని నియోజకవర్గాలపై కక్షతో ఒక్క రూపాయి నిధులను కూడా కేటాయించకపోవడం దుర్మార్గం అని అన్నారు. నిధులు కేటాయించకపోగా పురోగతిలో ఉన్న పపనులకు సైతం నిధులు నిలిపివేయడం మరో దుర్మార్గం. ఇప్పటివరకు రద్దు చేసిన ఎస్డీఎఫ్ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి రాష్ట్రస్థాయిలో ఒక సమీక్ష సమావేశం కూడా నిర్వహించలేదు. జిల్లా కలెక్టర్లు, అధికారులు సైతం రద్దు చేసిన పనులకు సంబంధించి ఎలాంటి సమీక్షా జరపలేదు. కనీసం పురోగతిలో ఉన్న పనుల నివేదికను ప్రభుత్వానికి ఇవ్వడంలో విఫలమయ్యారు. ప్రభుత్వం అనేది నిరంతర పక్రియ. ఈ పక్రియలో ప్రజల అవసరాలు మారవు. మారేది కేవలం ప్రభుత్వాలు మాత్రమే. గత ప్రభుత్వ ఆనవాలు లేకుండా చేస్తానని కంకణం కట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి తన అనాలోచిత చర్యలతో తన ఆనవాలునే ప్రజల్లో లేకుండా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్వార్థ పూరిత రాజకీయాలు చేయడం పక్కనపెట్టి, రాష్ట్ర అభివృద్ధికి పాటు పడాలి. గత ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ అవి ప్రజల అవసరాల కోసమే కాబట్టి ఆ పనులను పూర్తి చేసేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని, నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని అంటూ హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

# హెచ్‌సిఎలో భారీగా అవతవకలు

## అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి

**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో భారీగా అవకతవకలు జరిగాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి ఆరోపించారు. బీసీసీఐ నిధులను హెచ్‌సీఏ దుర్వినియోగం చేసిందని.. విచారణ జరిపించి అసోసియేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 'అజహరుద్దీన్ హయాంలో జరిగిన అవినీతి ఇప్పుడున్న జగన్‌మోహన్ హయాంలోనూ కొనసాగుతోంది. హెచ్‌సీఏ పరిధిలోని క్లబ్బులన్నీ అవినీతి మయంగా మారాయి. సుప్రీంకోర్టు తీర్పును, గ్రామీణ క్రికెట్‌ను పట్టించుకోట్లేదు. హెచ్‌సీఏపై తెలంగాణ ఏసీబీ, సీబీఐకి ఫిర్యాదు చేశాం. హెచ్‌సీఏ అవినీతిపై సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలి' అని కోరారు.

# నటి జత్వానీ పై పోర్జరీ కేసులతో వేధింపులు

**అమరావతి:** వైసీపీ నాయకులు ముంబై సినీ నటి జత్వానీ పై పోర్జరీ కేసులు పెట్టి ఇబ్బందులపాలు చేశారని ఏపీ సీఎం చంద్రబాబు ఆరోపించారు. ఈ ఘటనపై తొలిసారి స్పందించిన ఆయన వైఎస్ జగన్‌ను డ్రగ్ డాన్ ఫ్యాబ్లో ఎస్కోబార్‌గా పోల్చారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా సీఎం నటి జత్వానీ కేసు గురించి బహిరంగ సభలో మాట్లాడారు. బాధితులను రక్షించాల్సిన పోలీసులే ఆమెను బెదిరించి, చిత్రహింసలకు గురిచేసి అరెస్టు చేసి కస్టడీలో పెట్టారని ఆరోపించారు. వైసీపీ పాలనలో ప్రజలంతా భయపడ్డారని, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో స్వేచ్ఛ వాతావరణం కనిపిస్తుందని అన్నారు. ఎస్కోబార్‌లాంటి వ్యక్తులు మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్ సర్వనాశనం అవుతుందని పేర్కొన్నారు.

# పలు రాష్ట్రాలకు కాంగ్రెస్ కార్యదర్శుల నియామకం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ కీలక ప్రకటన చేసింది. పలు రాష్ట్రాలకు ఏఐసీసీ కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులను నియమిస్తున్నట్టు వెల్లడించింది. తెలంగాణ కాంగ్రెస్ సెక్రటరీగా విశ్వనాథన్, పీసీ విష్ణునాథ్‌ను నియమించింది. ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ సెక్రటరీగా సంపత్ కుమార్‌ను (తెలంగాణ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే) పార్టీ కమాండ్ నియమించింది. ఇక ఏపీ సెక్రటరీగా గణేష్ కుమార్ యాదవ్, జాయింట్ సెక్రటరీగా పాలక్ వర్మ పేర్లను పార్టీ ప్రకటించింది. ఇక ప్రస్తుత తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా ఉన్న దీపాదాస్ మున్షీకి సహాయకులుగా ఇన్‌ఛార్చి సెక్రెటరీలు వ్యవహరించనున్నారు.

# నాలుగోసారీ విజయం మాదే

## 2029 ఎన్నికల్లోనూ గెలిచి చూపిస్తాం

## గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో మోదీ సంచలన వ్యాఖ్య

**ముంబయి:** 2029 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా నాలుగోసారి విజయం సాధించి రికార్డు సృష్టిస్తామని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో భాజపా పూర్తి మోజార్టీ సాధించలేదని, దాంతో తాను ప్రజాదరణ కోల్పోయానని కొందరు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారని అన్నారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొన్న మోదీ.. 2029 ఎన్నికల్లో మళ్లీ విజయం సాధిస్తామని పేర్కొన్నారు. 'ఇది ఐదో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్. 2029లో జరిగే సమావేశాలకూ వస్తాను. గతంలో భారత్‌కు వచ్చే విదేశీ అతిథులు ఇక్కడి సంస్కృతిక వైవిధ్యాన్ని చూసి ఆశ్చర్యపోయేవారు. కానీ, ప్రస్తుతం మాత్రం ఫిన్‌టెక్ పురోగతి చూసి ఆశ్యర్యపడుతున్నారు' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విపక్షాలపైనా ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. గ్రామాల్లో ఇంటర్నెట్, విద్యుత్ కనెక్షన్లు లేవని, దేశ పురోగతి గురించి అనేక మంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని మండిపడ్డారు. అయినప్పటికీ.. గత దశాబ్ది కాలంలో భారత్ గణనీయ పురోగతి సాధించిందని అన్నారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో భాజపా పూర్తి మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ, ఇటీవల ఎన్నికల్లో (2024) మాత్రం మెజార్టీ మార్కును (272 సీట్లు) సాధించలేకపోయింది. దీంతో ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలతో కలిసి భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.







# కొత్త ఎనర్జీతో కల్కి-2 పార్ట్

మరో ఆరు నెలల్లో షూటింగ్ ప్రారంభిస్తాం

పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నాగ్అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన తాజా బ్లాక్ బస్టర్ 'కల్కి'. వైజయంతి మూవీస్ బ్యానర్‌లో వచ్చిన ఈ చిత్రం జూన్ 27న విడుదలై సూపర్‌హిట్ అందుకోవడమే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి రికార్డులను సృష్టించింది. ఇదిలావుంటే ఈ సినిమాకు సీక్వెల్ ఉందని నాగ్ అశ్విన్ ప్రకటించిన విషయం తెలిసిందే. సీక్వెల్‌ను అయితే ప్రకటించారు కానీ ఎప్పుడు మొదలుపెట్టనున్నారు అనేది మాత్రం వెల్లడించలేదు. అయితే తాజాగా కల్కి 2 సినిమా షూటింగ్‌కు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను పంచుకున్నారు నిర్మాతలు స్వప్నదత్, ప్రియాంకదత్‌లు. వీరిద్దరూ.. మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ వీక్‌లో పాల్గొని అక్కడి మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ క్రమంలోనే మూవీ అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఈ మూవీ షూటింగ్ అప్‌డేట్‌పై నిర్మాత ప్రియంకా దత్ మాట్లాడుతూ.. కల్కి 2 షూటింగ్ మరో ఆరు నెలల్లో మొదలు పెట్టనున్నట్లు చెప్పారు. ఒక్కసారి మూవీ షూటింగ్ స్టార్ట్ అయితే వరుస అప్‌డేట్‌లను ఇస్తాం అని తెలిపారు. స్వప్నా దత్ మాట్లాడుతూ.. మొదటి పార్ట్ కంటే ఈ మూవీ కోసం ఎక్కువగా ఇంట్రెస్ట్‌గా ఉన్నాం. కల్కి నుంచి చాలా నేర్చుకున్నాం. కొత్త ఎనర్జీతో కల్కి 2ను మొదలుపెట్టబోతున్నాం అంటూ చెప్పుకొచ్చింది.

# నటుడు నితిన్ భార్య కోసం షూటింగ్‌కు సెలవు



యంగ్ హీరో నితిన్ సక్సెస్, ఫెయిల్యూర్స్ తో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నాడు. చివరిగా నితిన్ మాచర్ల నియోజకవర్గం మూవీతో ప్రేక్షకుల ముందుకి వచ్చారు. ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. కమర్షియల్ యాక్షన్ జోనర్ లో వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులని నిరాశ పరిచింది. నితిన్ చివరిగా భీష్మ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. అవుట్ అండ్ అవుట్ కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ గా ఆ చిత్రం వెంకీ కుడుముల దర్శకత్వంలో వచ్చింది. మరల ఇప్పుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ రాబిన్ హుడ్ అనే మూవీ చేస్తున్నాడు. ఇది కూడా కామెడీ అండ్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ గానే ఉండబోతోంది. శ్రీలీల ఈ చిత్రంలో నితిన్ కి జోడీగా నటిస్తోంది. దీంతో పాటుగా దిల్ రాజు బ్యానర్ లో వేణు శ్రీరామ్ దర్శకత్వంలో తమ్ముడు మూవీ నితిన్ చేస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. మారేడుమిల్లిలో కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారంట. కాంతారా ఫేమ్ సప్తమి గౌడ ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇదిలా ఉంటే నితిన్ ఇప్పుడు ఈ సినిమాల షూటింగ్స్ నుంచి రెండు నెలలు బ్రేక్ తీసుకోవాలని అనుకుంటున్నారంట. నితిన్ 2020లో షాలిని కందుకూరిని వివాహం చేసుకున్నారు. ఇద్దరిది ప్రేమ వివాహం. ఇద్దరు కూడా ప్రస్తుతం హ్యాపీ లైఫ్ లీడ్ చేస్తున్నారు. కొంతకాలం క్రితం షాలిని గర్భవతి అయ్యిందంట. ఆమెకి సెప్టెంబర్ లో డెలివరీ డేట్ ఇచ్చారంట. దీంతో రెండు నెలల పాటు భార్యతో స్పెండ్ చేసేందుకు నితిన్ షూటింగ్స్ కి బ్రేక్ ఇవ్వాలని అనుకుంటున్నారంట. రాబిన్ హుడ్ సినిమాని డిసెంబర్ 20న రిలీజ్ చేస్తున్నట్లు మైత్రీ మూవీ మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. తమ్ముడు మూవీని కూడా వీలైనంత వేగంగా ప్రేక్షకుల ముందుకి తీసుకురావాలని అనుకుంటున్నారు. మరి రెండు నెలల పాటు షూటింగ్స్ కి నితిన్ బ్రేక్ ఇస్తే అనుకున్న ప్రకారం వాటిని రిలీజ్ చేయడం కుదురుతుందా అనే ప్రశ్న ఇప్పుడు వినిపిస్తోంది. తమ్ముడు సినిమా షూటింగ్ ఆల్ మోస్ట్ చివరి దశకి వచ్చేసిందని టాక్ వినిపిస్తోంది.



# ఐశ్వర్యతో ఆన్‌స్క్రీన్ బాగా ఉంటుంది: విక్రమ్

విక్రమ్ నటించిన తాజా చిత్రం 'తంగలాన్' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్ తో వర్కింగ్ గురించి విక్రమ్ స్పందించారు. ఆమె తనకు మంచి మిత్రురాలన్నారు. ఆమె కంటే ఎక్కువగా అభిషేక్ బచ్చన్‌తోనే తనకు మంచి అనుబంధం ఉందని చెప్పారు. తమ కాంబోలో వచ్చిన రెండు చిత్రాల్లోనూ ముగింపు బాధాకరంగా ఉంటుందని ఆయన తెలిపారు.

'అభిషేక్ బచ్చన్ నాకు క్లోజ్ ఫ్రెండ్. దానివల్ల ఆయన కుటుంబసభ్యులతోనూ నాకు మంచి అనుబంధం ఉంది. ఐశ్వర్యరాయ్ మంచి మిత్రురాలు. ఆమె గొప్ప నటి. మా మధ్య చక్కని ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఉంది. సినీప్రియులు దానిని ఆస్వాది స్తుంటారు. ఇప్పటివరకూ మా కాంబోలో 'రావన్', 'పొన్నియిన్ సెల్వన్' చిత్రాలు వచ్చాయి. ఆయా చిత్రాల్లో మా పాత్రల ప్రేమకథకు సరైన ముగింపు ఉండదు. రెండు చిత్రాల్లోనూ ఆమె వేరే వ్యక్తి భార్యగా కనిపిస్తారు. చివరకు నా పాత్ర మృతి చెందుతుంది. అది ఫ్యాన్స్‌ను బాధకు గురిచేస్తుంది. ఇదే విషయంపై దర్శకుడు మణిరత్నంను నేను రిక్వెస్ట్ చేశా. మా ఇద్దరి పాత్రలకు సంతోషకరమైన ముగింపు ఇచ్చేలా ఒకే ఒక్క సినిమా చేయమని అడిగా. దానివల్ల అభిమానులు ఆనందపడతారని చెప్పా' అని విక్రమ్ తెలిపారు. విక్రమ్ - అభిషేక్ బచ్చన్ - ఐశ్వర్యరాయ్ కాంబోలో తెరకెక్కిన తొలి చిత్రం 'రావన్' మణిరత్నం దర్శకత్వం వహించారు. ఈ సినిమా క్లైమాక్స్‌లో విక్రమ్ పాత్ర మృతి చెందుతుంది. ఇదే కాంబోలో ఇటీవల వచ్చిన చిత్రం 'పొన్నియిన్ సెల్వన్' చోళుల వైభవం, ఆ సామ్రాజ్య పతనానికి కారణమైన విషయాలను తెలియజేస్తూ దీనిని రూపొందించారు. ఇందులో ఆదిత్య కరికాలన్‌గా విక్రమ్, నందినిగా ఐశ్వర్యరాయ్ నటించారు. ఇద్దరూ ప్రేమించుకున్నప్పటికీ అనివార్య కారణాల వల్ల నందిని మరో వ్యక్తిని పెళ్లాడాల్సి వస్తుంది. ఆదిత్య కరికాలన్ పాత్ర మృతితో ఈ సినిమా ముగుస్తుంది. 'తంగలాన్' విషయానికి వస్తే.. ఆగస్టు 15న ఈ చిత్రం దక్షిణాదిలో విడుదలై మంచి టాక్ సొంతం చేసుకుంది.



# పాట రాసాను.. పాడాను అంటున్న ఫరియా

శ్రీసింహా హీరోగా రానున్న చిత్రం 'మత్తు వదలరా 2' రితేశ్ రానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌లో ఫరియా అబ్దుల్లా కీలక పాత్రలో కనిపించనున్నారు. సెప్టెంబర్ 13న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈసందర్భంగా మీడియాతో మూవీ టీమ్ ముచ్చటించింది. 'నేను వర్క్ చేసిన టీమ్‌లలో ఇది బెస్ట్. షూటింగ్ చాలా సరదగా జరిగింది. ఈ సినిమా కోసం నేను ఓ పాట రాశాను. దాన్ని నేనే పాడి కొరియోగ్రఫీ చేశాను. కొత్తగా ఉంటుంది. ఎంజాయ్ చేస్తారు' అని ఫరియా అన్నారు. 'మత్తు వదలరా'తో నేను ఇండస్ట్రీకి వచ్చాను. 5 ఏళ్ల తర్వాత దాని సీక్వెల్‌కు వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి సినిమాలు తక్కువగా వస్తుంటాయి. ఫస్ట్ పార్ట్‌కు థియేటర్‌లోనే కాకుండా ఓటీటీలోనూ మంచి ఆదరణ లభించింది. దీని సీక్వెల్‌ను అలానే ఆదరిస్తారని ఆశిస్తున్నా' అని కాలభైరవ చెప్పారు. మొదటిభాగం అంచనాలకు మించి విజయం సాధించిందని శ్రీసింహా ఆనందం వ్యక్తంచేశారు.



---



# ఆ వ్యాఖ్యలు పుష్పను ఉద్దేశించి కాదు

పవన్ వ్యాఖ్యలపై నిర్మాత రవిశంకర్ క్లారిటీ

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గత నెల బెంగళూరు పర్యటనలో ఉన్నప్పుడు అడవుల నరికివేతపై సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇంతకుముందు సినిమాల్లో హీరోలు అడవులని కాపాడేవారు. కానీ ఈరోజుల్లో గొడ్డళ్లు పట్టుకొని, స్మగ్లింగ్ చేయడం అడవులను నరికివేయడం హీరోయిజం అయిపోయింది. నేను ఆ పరిశ్రమలో ఉన్నానని అలోచించుకుంటే అప్పుడప్పుడు బాధగా అనిపిస్తుంటుంది. ఇలాంటివి తగ్గి మళ్లీ అడవుల ప్రాముఖ్యత తెలిసేలా సినిమాలు రావాలని పవన్ కళ్యాణ్ చెప్పారు. అయితే పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అల్లు అర్జున్‌ను ఉద్దేశించి చేసినవే అంటూ నెటిజన్లు కామెంట్లు పెట్టారు. అల్లు అర్జున్ నటిస్తున్న పుష్ప సినిమాలో గొడ్డళ్లు పట్టుకొని, స్మగ్లింగ్ చేయడం అడవులను నరికివేయడం లాంటివి ఉండడంతో కావాలని వ్యాఖ్యలు చేస్తున్నాడని అల్లు ఫ్యాన్స్ పవన్‌పై విమర్శలు గుప్పించారు.

ఇదిలావుంటే తాజాగా ఈ వివాదంపై ఉస్తాద్ భగత్ సింగ్ నిర్మాత రవిశంకర్ క్లారిటీ ఇచ్చాడు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు అల్లు అర్జున్ ? 'పుష్ప 2'ను ఉద్దేశించి కాదని క్లారిటీ ఇచ్చారు. పవన్ అలా ఎప్పుడు మాట్లాడరని.. మెగా ఫ్యామిలీ అంతా ఒక్కటే అని చెబుతాడని చెప్పుకోచ్చాడు. ఇక ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా గురించి మాట్లాడుతూ.. ఈ మధ్యే పవన్ కల్యాణ్‌ను కలిశాను. త్వరలోనే 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది జనవరి నాటికి షూటింగ్ పూర్తి చేయాలి అనుకుంటున్నాం. సెప్టెంబర్ 2 పవన్ బర్త్‌డే నాడు ఓ సర్‌ప్రైజ్ కచ్చితంగా ఉండబోతుంది అంటూ రవి శంకర్ చెప్పుకోచ్చాడు.